వడ్లకు బోనస్‌పై పూటకో మాట

- ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు..
- కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులదీ అదే దారి
- అన్ని రకాల వడ్లకు ఇస్తామని ఒకసారి..
- సన్న వడ్లకు మాత్రమేనని మరోసారి
- మొదలు సన్న వడ్లకు..తర్వాత దొడ్డు వడ్లకు
- కాంగ్రెస్ నాయకుల మోసపు ముచ్చట్లు

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): ధాన్యానికి రూ.500 బోనస్‌పై కాంగ్రెస్ నేతలు పూటకో మాట మాట్లాడుతున్నారు. అసెంబ్లీ ఎన్నిక లతో పాటు మొన్నటి పార్లమెంట్ ఎన్నికల వరకు సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, ఇతర కీలక నేత లంతా ధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రకటనలు గుప్పించారు. తీరా ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని నాలుక మడతేశారు. దీనిపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో మళ్లీ నాలుక తిరగేశారు. ఇప్పటికైతే సన్న ధాన్యంతో బోనస్ మొదలు పెట్టినం.. తర్వాత దొడ్డు ధాన్యానికి కూడా ఇస్తామని దిద్దుబాటు ప్రకటనలు చేశారు. ఈ విధంగా పైనుంచి కిందిస్థాయి వరకు మద్దతు ధర, ధాన్యానికి బోనస్‌పై కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలను పరిశీలిస్తే..

సీఎం రేవంత్‌రెడ్డి

- 'వచ్చే సీజన్ నుంచి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇచ్చి సేకరిస్తాం'
  – ఏప్రిల్ 15న నారాయణపేట సభలో
- 'భద్రాద్రి రామయ్య సాక్షిగా వచ్చే వానకాలం సీజన్ నుంచి వడ్లకు రూ.500 బోనస్ ఇస్తాం'
  – ఏప్రిల్ 19న మహబూబాబాద్ సభలో
- సన్నవడ్ల పండించే రైతులకు దిగుబడి తగ్గి, ఖర్చు ఎక్కువపవుతున్నది. అందుకే రైతులు సన్నాలను సాగు చేస్తలేరు. సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇస్తే రైతులు సన్నాల సాగుకు ముందుకొస్తారు.
  – మే 14న విలేకరులతో చిట్‌చాట్‌లో
- సన్నవడ్లకు మాత్రమే రూ. 500 బోనస్ ఇవ్వాలని నిర్ణయం.
  –మే 20న కేబినెట్ సమావేశంలో

కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

- 'ధాన్యం బోనస్‌పై మేం అన్నదేమిటీ... ఎమ్మెస్పీ(మద్దతు ధర) కన్నా ఏ రైతుకైనా తక్కువ ధర వచ్చి నష్టం జరిగితే వాళ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పినం.'
  – ఫిబ్రవరి 13న గాంధీభవన్‌లో
- 'సన్న వడ్లకే బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడా చెప్పలేదు.'
  –మే 17న విలేకరుల సమావేశంలో

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

- 'వచ్చే వానాకాలం సీజన్ నుంచి క్వింటా వరి ధాన్యానికి రూ. 500 చొప్పున బోనస్ చెల్లిస్తాం'.
  – ఫిబ్రవరి 4న ఓ సమావేశంలో
- 'ప్రస్తుతానికి సన్న ధాన్యానికి 500 బోనస్ ప్రకటించినం. దశల వారీగా అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇస్తాం'.
  – మే 21న

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్

- 'సన్న వడ్లకే రూ. 500 బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడా చెప్పలేదు. సీఎం అనని మాటలను అన్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

–మే 17న విలేకరుల సమావేశంలో

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

- 'వచ్చే సీజన్ నుంచి ధాన్యానికి 500 బోనస్ ఇస్తాం. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి కూడా రైతులకు మాట ఇచ్చారు.'
  – ఏప్రిల్ 25న

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

- దొడ్డు వడ్ల సాగుకు కష్టం తక్కువ, పెట్టుబడి కూడా తక్కువే. దిగుబడి ఎక్కువగా ఉంటుంది.. అదే సన్న వడ్లకు కష్టం ఎక్కువ, పెట్టుబడి ఎక్కువ, దిగుబడి తక్కువ ఉంటది. అయినప్పటికీ ప్రభుత్వం సన్నవడ్లను సాగు చేయమని చెప్తున్నది.
  –2020 డిసెంబర్ 05
- రూ. 500 బోనస్ సన్నవడ్ల రైతులకు ఇవ్వడం వల్ల సన్నాల ఉత్పత్తి పెరిగి అందరికీ సన్న బియ్యం అందుతుంది. అందుకే తొలుత సన్నవడ్లకు బోనస్ ఇస్తున్నాం.

–2024 మే 22న

మ్యానిఫెస్టోలో...

'వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తాం. ప్రస్తుతం క్వింటాలుకు రూ. 2,183 మద్దతు ధర ఉండగా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,683 చెల్లిస్తుంది.' అని ఉన్నది.

- 2022 మే 6న వరంగల్‌లో నిర్వహించిన సభలో కాంగ్రెస్ రైతు డిక్లరేషన్‌ను ప్రకటించింది. ఈ సభలో కాంగ్రెస్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించారు.

లోకం పోకడ

అది 'మంజుమ్మల్ బాయ్స్' సిన్మా కాదు..
హైదరాబాద్ రోడ్ల దుస్థితి మీద ప్రత్యేక ప్రోగ్రాం!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	44.9°c	28.6°c
మెదక్	42.8°c	26.4°c
రంగారెడ్డి	42.7°c	24.7°c
ఖమ్మం	42.0°c	33.0°c
కరీంనగర్	41.0°c	29.0°c
మహబూబ్‌నగర్	41.0°c	27.5°c
హైదరాబాద్	40.0°c	27.8°c
నల్లగొండ	39.5°c	25.2°c
నిజామాబాద్	39.3°c	25.39°c
వరంగల్	39.0°c	28.0°c

బలపడనున్న తీవ్ర వాయుగుండం

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ) : తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం శనివారం రాత్రికి తుపానుగా బలపడుతుందని విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ శనివారం తెలిపారు. తుపాను ఉత్తరం వైపుగా కదులుతూ ఉదయానికి తీవ్ర తుఫానుగా మారి అర్ధరాత్రి బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరాల సమీపంలో సాగర్ ద్వీపం-ఖేపుపరా మధ్య తీరం దాటే అవకాశం ఉన్నదని వివరించారు. సోమవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని అప్రమత్తం చేశారు. దక్షిణ కేరళ పరిసరాల్లో సముద్రమట్టానికి సగటున 5.8కిమీ వరకు ఆవర్తనం విస్తరించి ఉన్నదని, మరో ఆవర్తనం ఈశాన్య మధ్యప్రదేశ్ సమీపంలో విస్తరించిందని తెలిపారు. రాజస్థాన్ నుంచి మధ్యప్రదేశ్ , విదర్భ మీదుగా తెలంగాణ వరకు ద్రోణి కొనసాగుతుందని, దీని ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ విభజన!

మాదిగ, మాల కార్పొరేషన్లుగా ఏర్పాటు..

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ షెడ్యూల్డ్ కులాల కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను విభజించనున్నారు. మాదిగ కార్పొరేషన్, మాల కార్పొరేషన్ పేరిట రెండు వేర్వేరు సంస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎన్నికల కోడ్‌కు ముందే ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేయగా సంబంధిత అధికారులు ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా షెడ్యూల్డ్ కులాలన్నింటికీ సబ్సిడీ రుణాలను, వ్యవసాయాభివృద్ధి తదితర పథకాలను, ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన దళితబంధు పథకాన్ని కూడా ఎస్సీ కార్పొరేషన్ ద్వారానే క్షేత్రస్థాయిలో అమలు చేశారు. పథకం అమలు, పర్యవేక్షణ మొత్తం కార్పొరేషనే పర్యవేక్షించింది. అయితే ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్‌ను మాదిగ, మాల కార్పొరేషన్లుగా విభజించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల కోడ్‌కు ముందే ఉత్తర్వులు జారీ చేసింది. మాదిగ కార్పొరేషన్ కింద ఏయే షెడ్యూల్డ్ కులాలను చేర్చాలి, మాల కార్పొరేషన్ కింద ఏయే షెడ్యూల్డ్ కులాలను చేర్చాలి అనే అంశంపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు గల నిర్దేశిత లక్ష్యాలపై కూడా మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసే నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని యోచిస్తున్నారు.

కరెంట్ కోత.. అంత్యక్రియలకు వ్యథ

మొదటిపేజీ తరువాయి...

20 లీటర్ల మినరల్ వాటర్ బాటిల్ తెప్పించుకుని అంతిమకార్యం పూర్తి చేయాల్సి వచ్చింది. అంత్యక్రియలకు హాజరైన కుటుంబసభ్యులు, బంధువులకు కిలోమీటర్ కాలినడక తరువాత మిషన్ భగీరథ నల్లా నీళ్లే స్నానానికి అక్కరకు వచ్చాయి. ఈ ఘటన మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలో శనివారం జరుగగా, అంత్యక్రియలకు హాజరైన వాళ్లంతా సర్కారుకు శాపనార్థాలు పెట్టడం కనిపించింది. భీమారం మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన కుమ్మరి శంకరమ్మ (58) శుక్రవారం రాత్రి 10 గంటలకు చనిపోయింది. శనివారం ఉదయం 11 గంటలకు అంతిమయాత్ర నిర్వహిస్తూ ఊరి శివారుకు చేరుకున్నారు. తన తల్లికి తలకొరివి పెట్టే క్రమంలో కుమారుడు స్నానం చేయాల్సి ఉండగా, బోరు బావి వద్దకు చేరుకున్నాడు. ఆ సమయంలో కరెంట్ లేక బోర్లు పోయలేదు. అరగంట పాటు ఎదురుచూసి చివరకు విద్యుత్ అధికారులకు ఫోన్ చేయగా, మధ్యాహ్నం 12 గంటల దాకా కరెంట్ రాదని చెప్పారు. దీంతో చేసేదేమీ లేక అప్పటికప్పుడు 20 లీటర్ల మినరల్ వాటర్ తెప్పించగా, వాటితో రమేశ్ స్నానం చేశాడు. అనంతరం తలకొరివి పెట్టాడు. ఆపై కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు అక్కడి నుంచి కిలోమీటర్ దూరం వరకు నడిచి కట్టె డిపో వద్ద ఉన్న మిషన్ భగీరథ నల్లా కింద స్నానం చేసి ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. కేసీఆర్ సర్కారులో ఇలాంటి పరిస్థితులను చూడలేదని, రేవంత్ సర్కారు పదేళ్ల కిందటి కాంగ్రెస్ పాలనను గుర్తు చేస్తుందని అంత్యక్రియలకు హాజరైనవారంతా మండిపడ్డారు.

మక్కజొన్న సొప్ప కాలుస్తూ..ఊపిరాడక రైతు మృతి

- వరంగల్ జిల్లా కాట్రపల్లిలో విషాదం

భగవాన్‌రెడ్డి (ఫైల్)

సంగెం, మే 25 : మక్కజొన్న సొప్ప కాలుస్తుండగా పొగతో ఊపిరాడక ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లి గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సంగెం మండలం కాట్రపల్లికి చెందిన గాయపు భగవాన్‌రెడ్డి (55) అనే రైతు తన మక్కజొన్న చేనులో శనివారం సాయంత్రం సొప్పకు నిప్పంటించాడు. అతడి చేను పూర్తిగా కాలి పక్కన ఉన్న రైతు భాస్కర్ రెడ్డి వేసిన ఆయిల్‌పామ్ తోటలోని అంతర్గత పంటగా మక్కజొన్న చేనులోకి మంటలు వ్యాపించాయి. అందులో ఆయిల్‌పామ్ పంటతోపాటు డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోతాయనే భయంతో భగవాన్‌రెడ్డి మంటలను ఆర్పేందుకు ఆ చేనులోకి వెళ్లాడు. అప్పటికే చేను అంటుకోవడంతో పాటు విపరీతమైన పొగ రావడంతో ఊపిరి ఆడక భగవాన్‌రెడ్డి అక్కడికక్కడే మరణించాడు. భగవాన్‌రెడ్డికి తల్లి, భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు.

4 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

బషీరాబాద్/నీలగిరి, మే 25 : వికారాబాద్ జిల్లా బషీరాబాద్ పోలీసులు నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఎస్సై రమేశ్‌కుమార్ కథనం ప్రకారం.. ఎస్సై, వ్యవసాయ శాఖ అధికారి సూర్యప్రకాశ్‌తో కలిసి బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామానికి వెళ్లగా అక్కడ ఇద్దరు వ్యక్తులు రెండు సంచులతో అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేస్తే, అందులో విడి పత్తి విత్తనాలు ఉన్నట్టు గుర్తించారు. వాటి గురించి విచారించగా దౌల్తాబాద్ మండలం వీర్లపల్లికి చెందిన ఓ వ్యక్తి వద్దనుంచి తీసుకొని మండలంలోని ఎక్మాయి గ్రామంలో రైతులకు విక్రయించేందుకు తెచ్చినట్టు చెప్పారు. వారి నుంచి 4 క్వింటాళ్ల 15 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని, విఠలప్ప, చిన్నగుంట రాములపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

280 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

నల్లగొండ జిల్లాలో 280 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు పాల్వాయి శ్రావణ్‌కుమార్ శనివారం తెలిపారు. రెండు రోజుల క్రితం మిర్యాలగూడలో 260 కిలోలు, శాలిగౌరారం మండలంలో 20 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్టు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.

సన్న వడ్ల విత్తనాలకూ కొరత!

- ఇప్పటికే జనుము, జీలుగు, పత్తి విత్తనాలకు నానాతంటాలు
- విత్తన మేళాలో అందని సన్న రకాలు
- చేతులెత్తేసిన అధికారులు
- మార్కెట్లోనూ అదే పరిస్థితి
- నిరుటి ప్రణాళిక ప్రకారమే సన్నాల ఉత్పత్తి
- బోనస్ ప్రకటనతో పెరిగిన డిమాండ్

హైదరాబాద్, మే 25(నమస్తే తెలంగాణ): రైతులకు విత్తనాల కొరత సమస్య మరింత పెరుగుతున్నది. ఇప్పటికే జనుము, జీలుగు, పత్తి విత్తనాల కోసం నానా తంటాలు పడుతున్న రైతులకు కొత్తగా వడ్ల విత్తనాల కొరత కూడా ఇబ్బంది పెడుతున్నది. ముఖ్యంగా సన్న వడ్ల విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు శుక్రవారం వ్యవసాయ యూనివర్సిటీ అధ్వర్యంలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమమే అద్దం పడుతున్నది. ఈ విత్తనమేళాలో సన్న వడ్ల రకాల విత్తనాల కోసం రైతులు ఎగబడ్డారు. కానీ సరిపడా విత్తనాలు లేకపోవడంతో వారికి నిరాశ తప్పలేదు. దీంతో రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిసారి వెయ్యి నుంచి 1300 మంది రైతులు విత్తన మేళాకు వస్తుండగా ఈసారి మాత్రం ఈ సంఖ్య 2,800 వరకు ఉందని అధికారులు ప్రకటించారు. ఇందులో మెజార్టీ రైతులు సన్న ధాన్యం విత్తనాల కోసమే వచ్చినట్టు అధికారులు తెలిపారు. ముఖ్యంగా రైతులు తెలంగాణ సోనా(ఆర్ఎన్ఆర్), వరంగల్ సన్నాల కోసం డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది. తెలంగాణ సోనా రకం విత్తనాలను గతేడాది యూనివర్సిటీ కేవలం 121 క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే విక్రయించగా, ఈ సీజన్‌లో ఇప్పటికే 482 క్వింటాళ్ల విత్తనాలను రైతులు కొనుగోలు చేసినట్టు తెలిపారు. మరో 5వేల క్వింటాళ్ల విత్తనాలు ప్రాసెసింగ్‌లో ఉన్నట్టు యూనివర్సిటీ తెలిపింది.

హామీ ఇచ్చారు.. విత్తనాలు మరిచారు

సన్నధాన్యం సాగు చేస్తే రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఇందుకు సంబంధించి సన్న రకాల ధాన్యం విత్తనాలను అందుబాటులో ఉంచడంలో విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో 66 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని ఇందుకు 16.50 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. సాధారణంగా అయితే ఇందులో 70 శాతానికి పైగా దొడ్డు ధాన్యం విత్తనాలే ఉంటాయి. అంటే కేవలం 30 శాతంలోపే సన్న రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. దీనికి తోడు ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయాన్ని సరిగ్గా సీజన్ ప్రారంభానికి ముందు ప్రకటించడంతో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వ ఆలస్య ప్రకటనతో సన్న వడ్ల విత్తనాలకు కొరత ఏర్పడే పరిస్థితి నెలకొన్నది. బోనస్ ప్రకటనతో కొందరు రైతులు సన్న వడ్ల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ కొద్ది మంది రైతులకు కూడా విత్తనాలను అందించలేని పరిస్థితిలో ఉండటం గమనార్హం. వాస్తవానికి యూనివర్సిటీ అయినా, ప్రైవేటు కంపెనీలైనా గత ఏడాది ఉత్పత్తి ఆధారంగా(25-30శాతం) ఈ ఏడాదికి సన్న వడ్ల విత్తనాలను ఉత్పత్తి చేస్తాయి. కానీ, ప్రభుత్వం బోనస్ ప్రకటనతో సన్న వడ్ల విత్తనాలకు డిమాండ్ పెరిగి కొరత ఏర్పడింది. దీంతో ఇప్పుడు ఉత్పత్తి చేసి ఆ కొరత తీర్చే పరిస్థితి లేదు. దీంతో ఇప్పుడేం చేయాలనే దానిపై వ్యవసాయ శాఖ మల్లగుల్లాలు పడుతున్నది.

బ్లాక్ మార్కెట్ దందా, ధరలకు రెక్కలు

ప్రభుత్వం సన్నాలకే రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ప్రైవేటు కంపెనీలు బ్లాక్ దందాకు తెరలేపారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎలాగూ సన్నాలకు డిమాండ్ పెరుగుతుంది కాబట్టి.. దీన్ని సొమ్ము చేసుకోవాలని కంపెనీలు, వ్యాపారులు కుట్రలు చేస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ఇప్పటికే సన్న రకాల విత్తనాలను బ్లాక్ చేసి పెట్టినట్టు సమాచారం. తద్వారా మార్కెట్లో విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించి ఆ తర్వాత అధిక ధరకు విక్రయించేలా స్కెచ్ వేసినట్టు తెలిసింది. ఇదే జరిగితే రైతులకు విత్తనాల భారం తడిసి మోపెడవడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే ఆ 500 బోనస్ విత్తనాలకే సరిపోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి.. రైతులకు సకాలంలో సన్న రకం విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

పెద్దపల్లి జిల్లా జూలపల్లి కొనుగోలు కేంద్రం వద్ద అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌ను నిలదీస్తున్న యువ రైతు మల్లెత్తుల రాజు

వడ్లు కొంటరా..? అగ్గిపెట్టమంటరా?

- పెద్దపల్లి అదనపు కలెక్టర్ ఎదుట యువరైతు ఆవేదన
- వెంటనే కొనుగోలుకు సిబ్బందికి ఆదేశం

జూలపల్లి, మే 25 : 'సార్..సెంటర్‌కు వడ్లు తెచ్చి ఇరువై రోజులైతంది. మంచిగా ఎండబోసినం.. అప్పటి సంది ఇక్కడే పడిగాపులు కాత్తున్నం..కానీ కాంటాపెడ్తలేరు.. కడుపు మండుతున్నది.. మరి కొంటరా? వడ్ల కుప్పకు అగ్గిపెట్ట మంటరా?' అంటూ ఓ యువరైతు పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఎదుట గోడు వెళ్ల బోసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. శనివారం పెద్దపల్లి జిల్లా జూలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సందర్శించారు. రైతులతో మాట్లాడుతుండగా అక్కడికి వచ్చిన మల్లెత్తుల రాజు అదనపు కలెక్టర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. ఓ దిక్కు అకాల వర్షాలు మమ్మల్ని ఆగం జేత్తున్నయ్. సెంటరోళ్లు మాత్రం ఏమీ పట్టన్నట్టు ఉన్నరు. గన్నీ సంచులు ఇచ్చి చేతులు దులుపుకున్నరు. తూకం వేసేదెప్పుడో? ధాన్యం మిల్లులకు తరలించేదెప్పుడో? మా ఖాతాల్లో పైసలు ఎప్పుడు ఎస్తరో? అని అడిగాడు. స్పందించిన అదనపు కలెక్టర్ సెంటర్ నిర్వాహకులు, స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలు రావడంలేదని.. హమాలీల కొరత ఉన్నదని సమాధానమిచ్చారు. దీంతో వెంటనే లారీలను తెప్పించి.. వడ్లను కొనుగోలు చేయాలని సిబ్బందిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఒక దశలో సస్పెండ్ చేయమంటవా? నీకు చేతగాకుంటే ఇతరులకు అప్పగిస్తానని అని సింగిల్‌విండో సీఈవో గీస సురేశ్‌ను హెచ్చరించారు. సీఈవోపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సహకారశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ శ్రీకాంత్, తాహసీల్దార్ బషీరొద్దీన్ ఉన్నారు.

గాలివాన బీభత్సం

- పిడుగుపాటుకు ఇద్దరు మృతి

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బందనకల్‌లో చెట్టు విరిగి ధ్వంసమైన కారు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 25 : రాష్ట్రవ్యాప్తంగా శనివారం పలుచోట్ల మోస్తరు వర్షం కురవగా, కొన్ని ప్రాంతాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో వర్షం కురవడంతో రోడ్లపై చెట్లు విరిగిపడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ వైర్లు తెగిపడి, ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల ఇండ్ల పైకప్పులు, రేకులు లేచిపోయాయి. చెట్లు విరిగిపడడంతో కొన్నిచోట్ల కార్లు, ఇండ్లు ధ్వంసమయ్యాయి. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలకేంద్రంతో పాటు రత్నాపూర్, మేడిపల్లి మండలంలోని దమ్మన్నపేట, దేశాయిపేట, కథలాపూర్ మండలంలోని గంభీర్‌పూర్, తాండ్రియాల, పెద్దపల్లి జిల్లా ఓదెల,నాంసానిపల్లి, లంబాడితండా, సిరిసిల్ల, చందుర్తి మండలం, ముస్తాబాద్ మండల కేంద్రం, బందనకల్, గూడెం, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర, అక్కపల్లిలో గాలివాన కురిసింది.

పిడుగుపాటుతో లారీ డ్రైవర్ మృతి

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో ఓ ఎరువుల దుకాణంలో మందు బస్తాలను దింపే క్రమంలో ప్రమాదవశాత్తు జగిత్యాలకు చెందిన లారీ డ్రైవర్ మహమ్మద్ ఖదీర్(50) పిడుగుపాటుకు గురై గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్ఐ లచ్చయ్య ఘటనాస్థలానికి చేరుకుని కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

రైతు మృతి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలుచోట్ల శుక్రవారం అర్ధరాత్రి పెద్దఎత్తున ఈదురుగాలులు, వర్షం కురిసింది. సుమారు 150 వరకు విద్యుత్ స్తంభాలు, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లుతోపాటు చెట్లు నేలకొరిగాయి. అచ్చంపేట మండలం చెన్నారం శివారులోని జిన్నింగ్ మిల్లులో రాఫ్టర్లు విరిగిపడి రేకులు ధ్వంసమయ్యాయి. సూర్యతండాలో కోళ్ల షెడ్డు పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. మక్తల్ మండలం మంతన్‌గోడ్‌కు చెందిన రైతు కురుమూర్తి (42) తన వ్యవసాయ పొలంలో పిడుగుపాటుకు గురై మృతి చెందాడు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

భీమన్న (ఫైల్)

అయిజ రూరల్, మే 25 : విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అయిజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన రైతు కుర్వ భీమన్న (46)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయనకు మూడెకరాల పొలం ఉన్నది. పొలంలో పత్తి విత్తనాలు నాటాడు. శనివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లగా.. అక్కడ ఎవరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి ఉంచడాన్ని గమనించాడు. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న జంపర్ తెగి పక్కన ఇనుప సీకుల (యాంగ్లర్ల)పై పడింది. ఇది గమనించని రైతు ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేయడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

కటింగ్ లేకుండా నగదు జమ చేస్తాం

- రాఘవపేట కొనుగోలు కేంద్రంలో అధికారుల విచారణ

మల్లాపూర్, మే 25: ధాన్యం కొనుగోలు కేంద్రంలో కటింగ్ లేకుండా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని సెర్ప్ అధికారులు తెలిపారు. ఇష్టారాజ్యంగా ధాన్యం కటింగ్ శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో శనివారం ప్రచురితమైన కథనానికి ఐకేపీ సెర్ప్ ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు ఐకేపీ సెర్ప్ ఏపీఎం దేవరాజ్ సంబంధిత క్లస్టర్ సీసీ రాజు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో కలిసి మల్లాపూర్ మండలంలోని రాఘవపేట కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కేంద్రం నుంచి ఇప్పటికి 44 లారీల ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించినట్టు తెలిపారు. ఇందులో 32 లారీలకు సంబంధించిన లారీ ట్రక్ షీట్లను తీసుకువచ్చి రైతులకు డబ్బుల చెల్లింపు కోసం ఆన్‌లైన్ డాటా ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. మిగతా ట్రక్ షీట్లను రెండు రోజుల్లో తెప్పించి పూర్తి స్థాయిలో రైతులకు ఎలాంటి కటింగ్ లేకుండా డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటామని ఏపీఎం హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి, బుక్ కీపర్ పర్యవేక్షణ లోపం వల్లనే ఈ జాప్యం జరిగిందని, ఈ నివేదికను ఉన్నత అధికారులకు సమర్పించనున్నట్టు వారు వెల్లడించారు.

నమస్తే ఎఫెక్ట్

ధాన్యం కొనాలని రాస్తారోకో

- రెండు గంటలపాటు రైతుల బైఠ